
# మాదీ భీమవరమే !



'హాస్యానందం' మాసపత్రిక . . . ఆగస్ట్' 2004

వర్షం పడుతోంది!

చినుకుల చిటపటలు నెమ్మదిగా చిక్కపడి క్రమంగా ఊపందుకుంటున్నాయి. ముసురు పెరిగి వానవుతోంది. వర్షంతోబాటు చలికూడా తన ఉనికిని చాటుకొనేందుకు వణుకు పుట్టిస్తోంది.

హైదరాబాద్ వాతావరణానికి అలవాటుపడ్డ బుల్లిబాబుకి ఎంత చలిపెడుతున్నా లెక్క అనిపించడంలేదు. 'మాయదారి వాన' అనుకున్నాడే గాని, తన ఉత్సాహాన్ని తగ్గించుకోలేదు. చేతిలోని అంబ్రిల్లా మీట నొక్కేసరికి విచ్చుకొని- వర్షం బుల్లిబాబు మీద పడకుండా అడ్డుకొని చినుకుల్ని ఛిద్రం చేస్తోంది.

'అమ్మో..!' అనుకున్నాడు చేతివాచీని చూసుకుంటూ.

అప్పుడే టైము... ఐదున్నర!

'ఈ బస్సులు ఇంతే!' అనుకున్నాడు నిట్టూర్పుగా.

అహమ్మదాబాద్ రైల్వేస్టేషన్‌లో గుజరాత్ మెయిల్ రాకను చూసి అక్కడ అందరూ వాచీల టైమును సరిచేసుకుంటారట... అది అంత ప్రాంప్ట్! అలాగే భీమవరం నుండి వచ్చే బస్సులు కూడా లేట్ కాకూడదే! పావుగంట లేటా... బాప్‌రే!!

అమీర్‌పేట చౌరస్తా నిశ్శబ్దంగా ఉంది. చీకటిని విదుల్చుకొని తన ప్రాబల్యాన్ని పెంచుకోవడం కోసం వెలుతురు ప్రయాసపడుతోంది.

బుల్లిబాబు ఆతృతగా చూస్తున్నాడు. పంజగుట్ట వైపు నుండి వచ్చే బస్సుల్ని పరికించి చూస్తున్నాడు. విజయవాడ, కాకినాడ, విశాఖపట్టణం, మచిలీపట్నం, కొత్త వలస, ఆముదాల వలస, ఏలూరు, నెల్లూరు... ఒక్కటేమిటి- కళ్ళముందు అన్ని ఊర్ల బస్సులు దూసుకుపోతున్నాయి.

చలినీ, వర్షాన్నీ లెక్కచేయకుండా ఎదురుచూస్తున్నాడు బుల్లిబాబు. వెంకటరమణ, కేశినేని, మోడల్, సింధు... ఏమీ రావడంలేదు.

బుల్లిబాబు బి.పి. పెరుగుతోంది! 'తనవారిని ఎప్పుడు చూస్తానా..?!' అన్న ఆదుర్దా ఎక్కువగా ఉంది. చేతివాచీ 'పావుతక్కువ ఆరు' టైము చూపిస్తోంది.

ఏడున్నరకి దాదాపు గంట ముప్పావు టైము మాత్రమే ఉంది. అదే... 'నర్సాపూర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్'కి గంట ముప్పావు ఉంది.

'టైము చాలుతుందో, లేదో..?!' ఒకింత అసహనం బుల్లిబాబులో!

దూరం నుండి కన్పిస్తున్న బస్సుని చూసి కెవ్వున అరిచేంత పనిచేశాడు. 'భీమవరం టు హైదరాబాద్' అనే బోర్డు అక్షరాలు స్పష్టంగా అగుపిస్తున్నాయి.

"సార్‌గారూ! మీ ఊరు బస్సు వచ్చేస్తోంది!" వర్షానికి ఛర్మాస్ షోరూం ముందరి కారిడార్‌లో నిలబడ్డ ఆటోవాలా అరుపులాంటి స్వరంతో అన్నాడు.

"అవునయ్యా! కేశినేని ఇప్పుడు వస్తే, ఇక వెంకటరమణ ఎప్పుడు? ఆపై సింధు మరెప్పుడు?" గొడుగు సరిచేసుకుంటూ అన్నాడు బుల్లిబాబు.

"మీరు మరీనూ! వస్తాయిలెండి. రోడ్ బస్సులు లేటవకపోతే మరి ఎయిర్ బస్సులు లేటవుతాయా?" తెలుగు ఉర్దూ మేళవించిన హైదరాబాద్ భాషలో ముద్దుగా పలికాడు ఆ ఆటోడ్రైవర్ తనేదో పెద్ద జోక్ పేల్చినట్టు గట్టిగా నవ్వి.

బస్సు దగ్గరకు వచ్చేస్తోంది...

బుల్లిబాబుకి ఆనందమే ఆనందం!

"ఒరేఁ బడుద్దాయ్ఁ... సామాన్లు సరిగా దిగాయో, లేదో చూడు! అసలే హైదరాబాద్‌లో మోసాలెక్కువని మోతుబరి ముసలయ్య చెప్తుంటాడు!" బస్సులోంచి దిగలేక దిగుతున్న ఓ బట్టతల ముసలాయన మనవడి కేసి చురచురా చూస్తూ అంటున్నాడు.

"సర్లేవయ్యా! రాత్రి బస్సు అంతా నీ సౌండే!! దీని సౌండ్‌కన్నా నీ గురక సౌండ్ ఎక్కువయింది! ఇంతవరకూ సామాన్లు పోకుండా కాపలా కాసింది నేను. తడవకుండా ముందు దిగు!" తాతకు తగ్గట్టుగానే సమాధానం చెప్తున్నాడు ఆ కుర్రాడు.

"నన్ను దిగనివ్వండర్రా! మీ తగువులాటలతో నన్ను దిగనిచ్చేట్టు లేరు!" సన్నాయి పలుకులు పలుకుతున్నట్టుగా రాగాలు తీస్తోంది ముసలావిడ.

అదేమాట... అదే శ్లాంగు... అదే గోదావరి జిల్లా భాష... ప్రాణం లేచొచ్చినట్లుంది బుల్లిబాబుకి.

"ఉండరా! తెలుగులో మాట్లాడావంటే ఆటోవాళ్ళు అటకెక్కుతారు... నేను మాట్లాడతానుండు!" వర్షంలో తడుస్తూ ముసలాయన ముందుకెళుతున్నాడు. తనకున్న వచ్చీరాని హిందీ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు ఆయన.

"తాతగారూ... మనది భీమవరంలో ఎక్కడ?"

"బులుసుమూడి!" బ్యాగ్‌ని నెత్తిమీద పెట్టుకుంటూ అంటున్నాడు.

బుల్లిబాబు ముఖం వెలిగిపోతోంది.

"ఎక్కడి కెళ్లాలండీ!"

"బేగంపేట శాంతిబాగ్ అపార్టుమెంట్స్‌కి!" ఇరవై రూపాయలు చెబుతూన్న ఆటోవాలాని పదిహేనుకు బేరమాడి పెట్టాడు బుల్లిబాబు.

"మాదీ భీమవరమే తాతగారూ!"

"ఇంకేం మరి!" చటుక్కున చేతిలోని చిరుగుల బ్యాగ్‌ని బుల్లిబాబు చేతిలో పెడుతూ అన్నాడు.

"ఎక్కడ?" అందుకున్నాడు ప్రక్కనే తడుస్తూన్న తాతగారి మనవడు.

"గునుపూడి!"

"ఏవేవ్ఁ... ఈ బాబుది..."

"బాబు కాదు సార్... బుల్లిబాబు!"

"ఏదో బాబు లేవోయ్ఁ... బుల్లిబాబో, పెద్ద బాబో! ఈ బాబు... గునుపూడి బాబు!" పెళ్ళాం వైపు చూస్తూ అన్నాడు.

"ఏంటీ... మన భీమన్న గునుపూడే!"

– లోపలినుండి తన్నుకొస్తూన్న ఆనందంతో చూసింది.

"తాతగారు బులుసుమూడిలో ఏం చేస్తారో..?!"

"నేను రొఖ్ఖం రాజనాల... మాది రొఖ్ఖంవారి రొయ్యల వ్యాపారం!" తనకున్న బొద్దుమీసాన్ని తడుముకుంటూ అన్నాడు.

"ఎన్ని ఎకరాల్ని ముంచారేమిటి? అదేసార్... ఎన్ని ఎకరాల పంటపొలాలన్ని రొయ్యల పంట పొలాలుగా మార్చారని?!"

"పాతికపైనే అనుకో!" గర్వంగా చూస్తూ అన్నాడు.

"మరి, నీరో..?!" - హైదరాబాద్ నీటి ఎద్దడిని తలుచుకుంటూ అన్నాడు బుల్లిబాబు.

"మన భీమవరానికి నీటి కొదవేమిటయ్యా... గోస్త నది, ఎండగండి డ్రైను, నక్కల కాలువ! మనుషులు త్రాగడానికి నీళ్లు దొరకవు గాని- రొయ్యలకి కష్టం కాదు..."

ఆ మాటలు వింటూంటే ఆనందం హద్దులు దాటుతోంది బుల్లిబాబులో.

"మన ఊరివాళ్ళందరూ హైదరాబాద్‌కి వచ్చారన్నమాట!" బస్సులోంచి దిగుతూ వర్షానికి తడుస్తూన్న పాసింజర్స్‌ని ప్రేమగా చూస్తూ అన్నాడు.

"ఈరోజు రొయ్యల సేద్యంలో మెళకువలు!' అనే అంశం మీద జరగబోయే సదస్సులో పాల్గొనడానికి వచ్చాం. వస్తూ సిటీ చూస్తారని మా ఇంటావిడనీ, ఈ బుడతణ్ణీ తెచ్చాను!" చెప్పుకుపోతున్నారు రొఖ్ఖం రాజనాలగారు.

"మిమ్మల్ని అందర్నీ చూస్తుంటే భీమవరం కదిలి హైదరాబాద్ వచ్చేసిందనుకుంటున్నాను..." బుల్లిబాబుకి మనసు ఆగడం లేదు. మాటలు తన్నుకొస్తున్నాయి.

"ఈయన శ్రీరంగ రాజు... ఉండేది శ్రీరామపురం! వీరు బొండునాయుడు గారు, గుండువారి పేటలో బార్‌షాపు ఉంది. ఈ నర్సయ్య శెట్టి గారిది నర్సయ్య అగ్రహారం. ఈయన శివరామస్వామి గారు శివరావు పేటలో చిట్టుతవుడు వ్యాపారం. వీరు విశ్వేశ్వరయ్యగారు విస్సా కోడేరులో పెద్ద ఆసామి. ఈ మనిషి లంకా జగన్నాథం, లంకల కోడేరు మాజీ ప్రెసిడెంటు."

వచ్చినవారి నందర్నీ పేరుపేరునా పరిచయం చేసుకుంటున్నాడు బుల్లిబాబు. కడుపు నిండిపోతోంది అతనికి! పుట్టిన ఊరు వదిలి కమీషన్ వ్యాపారం కోసం హైదరాబాద్ వచ్చేసిన తరువాత భీమవరం పట్ల మమకారం మరింత ఎక్కువయింది.

ఇప్పుడు గుత్తివంకాయ కూర తింటే చేదుగా ఉంటోంది. అదే... భీమవరం గురించి ఎవరైనా నాలుగు మాటలు ఏకరువు పెడితే గుత్తివంకాయ ఘుమఘుమలు తన్నుకొస్తున్నాయి.

భీమవరం బియ్యం, భీమవరం బెల్లం తింటేనే గాని తృప్తి ఉండదు బుల్లిబాబుకి! అక్కడి రొయ్యలు, చౌకడిపో వెచ్చాలు ఎప్పుడూ బుల్లిబాబుని 'పెద్దబాబు' చేస్తూంటాయి.

రోజూ 'మార్నింగ్ వాక్' పేరుతో అమీర్‌పేట వచ్చేస్తూ ఉంటాడు. పాతబస్తీలో తన్నుకొని కర్ఫ్యూ విధించినా సరే- బుల్లిబాబు మనసు ఆగదు.., కాలు నిలువదు.

భీమవరం నుండి వచ్చే బస్సుల్ని చూసుకొని అందరు ప్రయాణీకుల్ని పలకరించి పులకిస్తూంటాడు.

తర్వాత ఆఫీసుకు వెళుతూ 'నర్సాపూర్- సికింద్రాబాద్' ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వచ్చే వేళకు అక్కడ వాలిపోతూ ఉంటాడు.

'ఇచ్చుటలో ఉన్న హాయి'ని వంటపట్టించుకున్నాడులా ఉంది. పనిలో పనిగా వీలున్నంత వరకూ భీమవరం పాసింజర్స్‌ని తన ఇంటికి తీసుకుపోయి, సకల మర్యాదలు చేసి పంపుతుంటాడు.

బుల్లిబాబు భార్య ఉదయలక్ష్మి పుట్టిల్లు 'ఉండి' కావడంతో- ఇద్దరూ 'ఉండి- భీమవరం'లా కలిసిపోయారు. దానితో తన స్థాయిలో తను 'భీమవరానుబంధాన్ని' కొనసాగిస్తోంది.

"కన్నతల్లినీ, ఉన్న ఊరునీ ప్రేమించనివాడు అసలు మనిషే కాదు!" అని హితబోధ చేయబోతే- 'ఊరు అంటే మట్టి కాదోయ్... ఊరు అంటే మనుషులోయ్!" అంటాడు పెద్ద వేదాంతిలా.

తల్లిని ప్రేమించకపోయినా, కనీసం ఆమెకు తిండి కూడా సరిగా పెట్టకపోయినా ఉన్న ఊరిని ప్రేమించడం మాత్రం నేర్చుకున్నాడు.

చివరకు- భీమవరం మీద మక్కువతో భాగ్యనగర్‌లో 'భీమనగర్ కాలనీ' అనే టౌన్‌టిప్‌కి శ్రీకారం చుట్టాడు బుల్లిబాబు.

అక్కడ కులాలకు, మతాలకు అతీతంగా తన ఊరివారందరి చేత స్థలాలు కొనిపించి ఇళ్లు కట్టించడం మొదలుపెట్టాడు.

అంతేకాకుండా మరింత ముందరకెళ్లి సేవాదృష్టితో 'భీమవరం వాసుల సాంస్కృతిక, సేవా వికాస కేంద్రాన్ని' ఏర్పాటుచేసి, శివరావుపేట విశిష్టతను, గునుపూడి పురాణ వైశిష్ట్యాన్ని, ఉండి ఉన్నతిని, బలుసుమూడి గొల్లవాని తిప్పల గొప్పదనాన్ని, మోగల్లు చరిత్రను, పాలకోడేరు కుముదవల్లిల ప్రగతిని, చెరుకువాడ, జువ్వలపాలెంల సామాజిక సహనాన్ని... ఒకటేమిటి- అక్కడి గొప్పదనాలని విశ్లేషించుకొని మురిసిపోతుంటారు.

అదే పండగ రోజుల్లోనయితే- 'సర్వం భీమమయం' అయిపోతుంది. అసలు భీమవరంలో పుట్టడం పూర్వజన్మ సుకృతమంటూ చెప్పుకొని ఆనందపడతారు.

క్రమంగా బుల్లిబాబు 'నాన్ రెసిడెన్షియల్ భీమవరమ్, (యన్.ఆర్.బి.)' అనే సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షుడు అయిపోయాడు. వెంటవెంటనే అక్కడి ఉత్సాహవంతులు అతన్ని 'భీమవర భూషణ', 'బెస్ట్ సిటిజన్ ఆఫ్ భీమవరం' అనే పురస్కారాలతో సన్మానించడం కూడా జరిగిపోయింది.

●

ఉదయలక్ష్మి మనసు మనసులో లేదు.

'ఉండి'లో ఉండి, భీమ'వరం' అనుకున్న తన భర్త ఇలా దెబ్బతింటాడని కలలో కూడా ఊహించలేదు. 'ఏదోలే... కమీషన్ వ్యాపారాల మొగుడు- కన్న ఊరును ప్రేమిస్తున్నాడ'నుకొంది. కానీ, ఇలా ఇరుకున పడేలా ప్రేమిస్తాడనుకోలేదు.

మొన్నటికి మొన్న 'వెంకట్రామా థియేటర్' సెంటర్లో మర్డర్ జరిగిందట! ఆ దుండగులు పారిపోయి పాతబస్తీలో తలదాచుకున్నారట! పోలీసులు వారి వివరాలు చెప్పమని బుల్లిబాబుని పట్టుకుపోయారు.

"తెలీదు మొర్రో!" అన్నా వినకుండా తాట తీసి ఒదిలారు.

"భీమవరం గొడవల సంగతి నీకు తెలియకపోతే ఇంకెవరికి తెలుస్తుంది?" అనిచెప్పి పదిహేను రోజులు రిమాండ్‌లో పెట్టేశారు.

ఆ కాలనీలో ఎవరికి వారు 'మాకు తెలియదంటే మాకు తెలియ'దని తప్పించుకుపోయారు.

"మాదీ భీమవరమే!" అంటూ భర్తమీద వాలిపోయినవాళ్ళు అందరూ మొహం చాటేశారు ఇప్పుడు. నిన్న కొటికలపూడి వారి కాలనీలో కోయంబత్తూరు నోట్లు పట్టుపడ్డాయి. దెబ్బకి ఆ ర్యాకెట్‌లో మనుషులు పరారైపోయారు.

షరా మామూలే..!

– ఆ కిరాయిమూక తప్పించుకొని హైదరాబాద్‌కి చేరిపోయారని పేపర్లో వార్త!

క్షణం కూడా ఆలస్యం చేయకుండా పోలీసులు బుల్లిబాబుని ఎక్కించుకుపోయారు.

"మీ భీమవరం వాళ్ళందరూ వచ్చి నీ పంచనే చేరతారు... ఎక్కడ వుంచావో చెప్పు?" అంటూ చితకబాది వదిలారు.

ఇప్పుడు 'స్వామీజీ టాకీస్' సెంటర్లో బంగారు బిస్కెట్స్ మార్పిడి కేసు!

మళ్లీ కథ మామూలే! తప్పించుకున్న వ్యక్తులు యూసఫ్‌గూడాలో నక్కిన వైనం పేపర్లో పెద్దపెద్ద అక్షరాలతో వచ్చింది.

ఎక్కడో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ఉధృతమై పెనుతుఫానుగా మారి తెలంగాణాని చుట్టుముట్టినట్లుంది బుల్లిబాబు పరిస్థితి! రోజురోజుకూ కారుమేఘాలు చుట్టూ కమ్ముకోసాగాయి.

ఒకప్పుడు "మాదీ భీమవరమే!" అంటూ భజన చేసేవారు ఎవరూ ఇప్పుడు కనిపించడం లేదు. ఎవరికి ఏ ఆచూకీ కావాల్సివచ్చినా ఈ 'భీమవర భూషణుడు' అందరికీ లోకువయిపోయాడు. ప్రతి సందర్భంలోనూ ఏదోవిధంగా ఇరుక్కుపోతున్నాడు.

నెమ్మదిగా బుల్లిబాబుకి తన మెతకతనం అర్థమవసాగింది. 'ఊరు, ప్రాంతం' అన్న వేర్పాటువాద ధోరణి ఎంత ప్రమాదకరమో స్వానుభవం మీద చూస్తున్నాడు... అనుభవిస్తున్నాడు.

ఇప్పుడు ప్రతి ప్రాతఃసంధ్యలోనూ బుల్లిబాబుకి ఓ సరికొత్త కిరణం కన్పిస్తోంది. ఆ కొత్తవెలుగు అతని ధోరణిలో, ఆలోచనలలో మార్పును తీసుకొస్తోంది...

క్రమంగా సమూలమైన నూతన విధానంతో పూర్తిగా మారిపోయాడు.

ఇప్పుడు అతని అడుగులు బస్సుల వైపు పడటం లేదు...

బుల్లిబాబు మనసు 'నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్' కోసం వెంపర్లాడటం లేదు.

'హాస్యానందం' మాసపత్రిక . . . ఆగస్ట్' 2004

తమ పుస్తకాలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

జయంతి పబ్లికేషన్స్

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.